# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 15-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గుజరాత్‌లోని దేదియాపాడలో 9 వేల 700 కోట్ల రూపాయలకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.
- ❖ స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఈరోజు 'జన్ జాతీయ గౌరవ్ దివస్'ను దేశ వ్యాప్తంగా జరుపుకున్నారు.
- ❖ అమృత్ పథకంతో పదేళ్లలో రోగులకు సుమారు 8 వేల 500 కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు.
- ❖ భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా రెండవ ఇన్నింగ్స్‌లో 63 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉంది.
- ❖ నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక తీరానికి ఆనుకొని అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణ విభాగం (IMD) పేర్కొంది.

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లోని గిరిజన ప్రాంతమైన నర్మదా జిల్లాలోని దేదియాపాడ పట్టణంలో 9 వేల 700 కోట్ల రూపాయలకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఈ రోజు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని జరుపుకుంటున్న జన్ జాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా ఈ ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... వేల సంవత్సరాలుగా గిరిజన ఆత్మగౌరవం భారతదేశ చైతన్యంలో అంతర్భాగంగా ఉందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజన సమాజం చేసిన సేవను దేశం ఎప్పటికీ మర్చిపోదని ఆయన ఉద్ఘాటించారు. గిరిజనుల అభివృద్ధిలో భాగంగా... శ్రీ గోవింద్ గురు చైర్ గిరిజన భాషా ప్రోత్సాహక కేంద్రాన్ని స్థాపించామని, ఇందులో అన్ని గిరిజన తెగల మాండలికాలపై అధ్యయనాలు నిర్వహిస్తారని నరేంద్ర మోదీ తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన నాయకుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఈరోజు `జన్ జాతీయ గౌరవ్ దివస్'ను దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. గిరిజన చరిత్ర ప్రాముఖ్యతను గుర్తించి, వారి వారసత్వాన్ని సజీవంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం నవంబర్ 15వ తేదీన ‘జన్ జాతీయ గౌరవ్ దివస్’గా నిర్వహిస్తోంది. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మాతృభూమి గౌరవాన్ని పరిరక్షించడంలో బిర్సా ముండా చేసిన అపూర్వమైన కృషిని యావత్ జాతి జన్ జాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా స్మరించుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా పోస్ట్ చేశారు. విదేశీ పాలనకు వ్యతిరేకంగా బిర్సా ముండా సాగించిన పోరాటం, త్యాగం ప్రతి తరానికి స్ఫూర్తినిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా బిర్సా ముండాకు నివాళులర్పిస్తూ.. ఆయనను గిరిజన అస్తిత్వానికి, భారతీయ ఆత్మగౌరవానికి చిహ్నంగా, గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడిగా అభివర్ణించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అధ్యక్షతన అమెరికాలోని భారత కాన్సుల్ జనరల్స్ సమావేశం న్యూయార్క్‌లో జరిగింది. భారత్ - అమెరికా ద్వైపాక్షిక సహకారం, ప్రవాస భారతీయులతో అనుసంధానం గురించి ఈ సమావేశంలో సమీక్షించారు. న్యూయార్క్‌లో నిన్న జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయంతో పాటు న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కో, చికాగో, అట్లాంటా, హ్యూస్టన్, బోస్టన్, లాస్ ఏంజిల్స్, సియాటెల్‌లోని కాన్సులేట్ల సీనియర్ దౌత్యవేత్తలు పాల్గొన్నారు. అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన `నషా ముక్త్ భారత్ అభియాన్` ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా, ముగింపు వేడుకలను నిర్వహించడానికి సిద్ధమవుతోంది. ఈ నెల 18వ తేదీన పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న గురునానక్ దేవ్ యూనివర్సిటీ ప్రాంగణంలో ముగింపు వేడుకలు జరగనున్నాయి. మాదక ద్రవ్యాల సమస్యను పరిష్కరించడానికి, నషా ముక్త్ భారత్ అభియాన్ ను ఆగస్టు 15, 2020న ప్రారంభించారు. ఈ పథకం నివారణ, చికిత్స, పునరావాసం అనే మూడు అంచెల వ్యూహంతో పని చేస్తోంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

సరసమైన ధరల్లో మందులు, చికిత్సకు అవసరమైన విశ్వసనీయ ఇంప్లాంట్‌లను అందించే లక్ష్యంతో ప్రారంభించిన 'అమృత్' పథకం నేటితో పదేళ్లు పూర్తి చేసుకుంది. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన 'అమృత్స పదవ వార్షికోత్సవ వేడుకల్లో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా మాట్లాడుతూ... ఈ కార్యక్రమం ద్వారా గత పదేళ్లలో రోగులకు సుమారు 8 వేల 500 కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు. ప్రస్తుతం వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొత్తం 255 అమృత్ ఫార్మసీలు పని చేస్తున్నాయని మంత్రి జేపీ నడ్డా వెల్లడించారు. ఇందులో గరిష్ఠ చిల్లర ధర (MRP)పై 50 శాతం వరకు రాయితీతో మందులను అందిస్తున్నారని పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ (MAHSR) పనుల పురోగతిని సమీక్షించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లోని సూరత్‌లో నిర్మాణంలో ఉన్న బుల్లెట్ రైలు స్టేషన్‌ను ఈ రోజు సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన, అధికారులతో మాట్లాడి, పురోగతి వివరాలను తెలుసుకున్నారు. భారతదేశ ప్రతిష్టాత్మక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకటైన ఈ ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ సుమారు 508 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ మార్గంలో 352 కిలోమీటర్లు గుజరాత్, దాద్రా నగర్ హవేలీ పరిధిలో, మిగిలిన 156 కిలోమీటర్లు మహారాష్ట్ర పరిధిలో ఉన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ శివారు నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో నిన్న రాత్రి జరిగిన పేలుడు ఘటనలో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో 27 మంది పోలీసు సిబ్బంది సహా మొత్తం 32 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై న్యూఢిల్లీలో కేంద్ర హోం వ్యవహారాల శాఖ జమ్ము కాశ్మీర్ విభాగం సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ లోఖండే ఈ రోజు మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో 27 మంది పోలీసు సిబ్బంది, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు పౌరులు గాయపడ్డారని, వారిని వెంటనే వైద్య చికిత్స కోసం ఆసుపత్రులకు తరలించామని ఆయన తెలిపారు. ఒక ఉగ్రవాద ముఠా నుండి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు, రసాయనాలను ప్రాసెస్ చేస్తుండగా ఈ పేలుడు సంభవించిందని వివరించారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందని, అనవసర ఊహాగానాలు చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ పేలుడు సంఘటనతో సంబంధం ఉన్న నలుగురు వైద్యుల పేర్లను ఇండియన్ మెడికల్ రిజిస్టర్ నుంచి తొలగించినట్లు నేషనల్ మెడికల్ కమిషన్ (NMC) ప్రకటించింది. డాక్టర్ ముజఫర్ అహ్మద్, డాక్టర్ అదిల్ అహ్మద్ రాథర్, డాక్టర్ ముజామిల్ షకీల్, డాక్టర్ షహీన్ సయీద్ రిజిస్ట్రేషన్లను ఎన్ఎంసీ రద్దు చేసింది. ఢిల్లీ పేలుడుకు సంబంధించి ఈ నలుగురిపై అక్రమ కార్యకలాపాల నివారణ చట్టం (UAPA) కింద కేసు నమోదు కావడంతో ఈ చర్య తీసుకున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఈ వైద్యులు ప్రాక్టీస్ చేయడానికి వీలు లేదని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్ లో జరుగుతోన్న తొలి టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఒక వికెట్ నష్టానికి గాను 37 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్ తో రెండవ రోజు ఆటను ప్రారంభించిన భారత్ 189 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా 63 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక తీరానికి ఆనుకొని అల్పపీడనం ఏర్పడిందని భారత వాతావరణ విభాగం (IMD) పేర్కొంది. ఈ అల్పపీడన ప్రభావంతో రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని IMD హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =